వాగులు దాటకండి



మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్) : నిరంతర వర్షాల కారణంగా జిల్లాలోని వాగులు, వంకలు నిండుగా ప్రవహిస్తున్న దృష్ట్యా వాగులు, వంకలను దాటే సాహసం ఎవరు చేయవద్దని కలెక్టర్ జి.రవినాయక్ సూచించారు. రానున్న రెండు రోజులు రాష్ట్రంలో భారీ వర్షాలు ఉన్నాయన్న రాష్ట్ర వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో బుధవారం సంబంధిత శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అత్యవసర సాయం కోసం 24 గంటలు అందుబాటులో ఉండేలా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. సాయం కోసం 08542241165 నంబర్‌కు కాల్ చేయవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉండే వారిని అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. వాగులు పొంగే చోట ఉన్న రోడ్లపై బారికేడ్లు, ప్రమాద సూచికలు, తాళ్లు ఏర్పాటు చేయాలని అన్నారు. రోడ్లను దాటేందుకు అనుమతించవద్దని, ప్రత్యామ్నాయ మార్గాలు సూచించాలని వివరించారు. అదేవిధంగా శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివాసం ఉండేవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని వివరించారు. వ్యాధులు సంభవించకుండా వైద్య ఆరోగ్యశాఖ చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాలలో తాగునీరు శుభ్రంగా అందేలా చూడాలని, అదేవిధంగా అగ్నిమాపక శాఖ , నీటిపారుదల శాఖ, విద్యుత్‌శాఖ వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్పీ నరసింహ గ్రామాల్లో వాగులు వంకలు ఎవరూ దాటకుండా చర్యలు తీసుకోవాలని, వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయాలని అన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్ రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సంపదవనాలకు ప్రాధాన్యం

తెలంగాణ క్రీడా ప్రాంగణాలకు ఇంకా స్థలాలు గుర్తించాల్సిన చోట ఎంత స్థలం అందుబాటులో ఉంటే అంత తీసుకోవాలని కలెక్టర్ జి.రవినాయక్ ఎంపీడీఓలను ఆదేశించారు. బుధవారం ఎంపీడీఓలు, ఎంపీఓలతో గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. పంచాయతీ భవనాలు త్వరగా పూర్తిచేయించాలన్నారు. అదేవిధంగా సంపదవనాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్దేశించిన అన్ని ఎకరాలలో వనాలు పూర్తి చేయాలని అన్నారు. కందకాల తవ్వకాల్లో వేగం పెంచాలన్నారు. ఉద్యాన పంటలకు లబ్ధిదారులను గుర్తించడం పూర్తిచేయాలని, వైకుంఠధామాలలో సోలార్ విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలని, 100 శాతం నీటి సౌకర్యం కల్పించాలని అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా డెల్టా స్కోర్ కు సంబంధించి గ్రామ పంచాయతీ తీర్మానంతో పాటు, ఒక నిమిషము వీడియోను సమర్పించాలని ఆదేశించారు. ఇన్‌చార్జ్ అడిషనల్ కలెక్టర్ యాదయ్య, డీఎఫ్ఓ సత్యనారాయణ, డీపీఓ వెంకటేశ్వర్లు, జెడ్పీసీఈఓ జ్యోతి, పంచాయితీరాజ్ ఈఈ నరేందర్ రెడ్డి, మిషన్ భగీరథ ఈఈ పుల్లారెడ్డి, ఏపీడీ జకీయా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

కప్లాపూర్‌లో మరోమారు ఫీవర్ సర్వే



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య బృందం

గండేడ్: కప్లాపూర్‌లో మరోమారు ఫీవర్ సర్వే నిర్వహించారు. గండేడ్ మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం కార్యక్రమం నిర్వహించారు. పలువురి రక్త నమూనాలు సేకరించారు. వాతావరణంలో మార్పులతో పాటు నీటి కలుషితం వల్ల వైరల్ ఫీవర్ సోకుతున్నట్లు ఆయన వివరించారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. నివారణకు ముఖ్యంగా వేడి చేసిన తాగునీటిని తాగాలన్నారు. ప్రతి ఆదివారం పది నిమిషాలు పరిసరాలను శుభ్రం చేసేందుకు కేటాయించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై పాటించాలన్నారు. ఎవరికి జ్వరం వచ్చినా ఏఎన్ఎంలకు గానీ, ఆశ వర్కర్‌కు గానీ సమాచారం అందించాలని, సకాలంలో వైద్యం చేయించుకోవాలని సూచించారు. దోమలు ప్రబలకుండా ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ వంటివి చేయాలని సర్పంచ్, సెక్రటరీలకు తెలిపారు. డెంగీ పేరుతో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి ఇబ్బందులు పడొద్దని వివరించారు.

ఆరు డెంగీ కేసులు నమోదు



ఆలూరులో యాంటీలార్వా ఆపరేషన్ పరిశీలిస్తున్న డీఎంఓ

జడ్చర్ల టౌన్: వర్షాలు పడుతుండటంతో అంటువ్యాధుల బెడద పెరుగుతోంది. తాజాగా మండలంలో మూడు డెంగీ కేసులు నమోదయ్యాయి. మున్సిపాలిటీ పరిధిలో అయిదు, ఆలూరులో ఒక కేసు నమోదైంది. వారం రోజుల క్రితం ఉదండాపూర్, బూర్గుపల్లి గ్రామాల్లోనూ ఒక్కో కేసు నమోదైంది. బుధవారం మున్సిపాలిటి పరిధిలోని డెంగీ బాధితుల ఇళ్లతోపాటు ఆలూరు గ్రామంలోని డెంగీసోకిన వ్యక్తి ఇంటిని జిల్లా మలేరియా అధికారి డా. శ్వేత సందర్శించారు. బాధితుల ఇళ్లతోపాటు చుట్టుపక్కల ఇళ్లల్లో యాంటీ లార్వా ఆపరేషన్ నిర్వహింపజేశారు. లార్వా నిల్వ ఉన్న పాత్రలు తొలగించుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఎవరైనా జ్వరపీడితులు ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించి రక్తనమూనాలు సేకరించాలని సిబ్బందికి సూచించారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేలా చూడాలన్నారు. ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించాలని, జ్వరాలు ఉంటే వెంటనే తగిన జాగ్రత్తలు తీసుకునేలా చూడాలని, వారికి మందులు అందించాలని సూచించారు. సబ్ యూనిట్ అధికారి రమేష్‌కుమార్, డా.స్నేహ, హెల్త్ అసిస్టెంట్లు శ్రీధర్‌రెడ్డి, జానకిరాం, ఏఎన్ఎం శ్రీదేవి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిశీలన

భూత్పూర్: మండలంలోని మద్దిగట్లలో నిర్మిస్తున్న డబుల్‌బెడ్ రూం ఇళ్లను బుధవారం ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి పరిశీలించారు. 3 నెలల్లో పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. మాజీ సర్పంచ్ నారాయణ గౌడ్, సీనియర్ నాయకులు కుర్మయ్య గౌడ్, గ్రామకమిటీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఓంకార్ రెడ్డి, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి

జడ్చర్ల: హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కలను సంరక్షించేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య తెలిపారు. ఆల్వాన్‌పల్లి సమీపంలోని మీనాంబరం వాగు పరివాహక ప్రాంతంలో బుధవారం ఉపాధి హామీ కూలీలతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జంగయ్య, రఘుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

కోయిల్‌కొండ: మండలంలోని గార్లపహాడ్‌లో బుధవారం 187వరోజు మండలం ప్రకటించాలని రిలేదీక్షలు కొనసాగాయి. మండలసాధన సమితి కోకన్వీనర్ వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ 12గ్రామాల ప్రజల మద్దతుతో రిలే దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువత సదస్సుకు తరలిరండి

నవాబుపేట: జడ్చర్ల నియోజకవర్గానికి సంబంధించి బీఆర్ఎస్ యువత సదస్సును ఈ నెల 30న నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు నర్సింహులు, యూత్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. మండలకేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆదేశాల ప్రకారం మాచారం రోడ్డులో కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. పెద్ద ఎత్తున యువత తరలిరావాలని కోరారు. మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, ఎంపీపీ అనంతయ్య, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, సర్పంచ్ గోపాల్‌గౌడ్, యూత్ ప్రధాన కార్యదర్శి రఘుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలుశిక్ష

నవాబుపేట: మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తులకు జరిమానాతో పాటు జైలుశిక్ష సైతం విధిస్తున్నట్లు ఎస్ఐ పురుషోత్తం తెలిపారు. మండలకేంద్రంలో బుధవారం నిర్వహించిన తనిఖీల్లో కోయిల్‌కొండ మండలం వింజమూర్‌కు చెందిన మహేష్ పట్టుబడినట్లు వివరించారు. కోర్టులో హాజరుపరచగా అతడికి రూ.2 వేలు జరిమానా, ఒకరోజు జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

8మంది బాధితులకు సెల్‌ఫోన్‌లు అందజేత

మహబూబ్‌నగర్ క్రైం: వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో పరిధిలో పలు సందర్భాల్లో చోరీకి గురైన సెల్‌ఫోన్‌లను పోలీసులు గుర్తించారు. సీఐ సైదులు ఆధ్వర్యంలో మంగళవారం 8మంది బాధితులకు ఫోన్లు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పట్టణంలోని కూరగాయల మార్కెట్ ఏరియాలో కొన్నిరోజులుగా గుర్తు తెలియని వ్యక్తులు సెల్‌ఫోన్‌లు చోరీ చేసిన దానిపై వచ్చిన ఫిర్యాదుల మేరకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వారంలో ఫోన్లు పట్టుకున్నామని అన్నారు.

కార్మికులపై చిన్నచూపు సరికాదు



చిన్నచింతకుంట: ప్రభుత్వం పంచాయతీ కార్మికులను చిన్నచూపు చూడడం సరికాదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ అన్నారు. బుధవారం సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఓబీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కోఆప్షన్ మెంబర్ మహిమూద్ పాల్గొన్నారు.
బాలానగర్: గ్రామ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని టీజీసీసీ చైర్మన్ వాల్యానాయక్, తదితరులు డిప్యూటీ తహసీల్దార్ దేవేందర్‌ను కలిసి విన్నవించారు. బుధవారం కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.
అడ్డాకుల: మండల కేంద్రంలో వెంకటేష్, రవిసాగర్, కుర్మయ్య, రాములు, వెంకటయ్య, సాయిలు, నాగన్న ఉన్నారు.
దేవరకద్ర: మండలకేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు బుధవారం సంతలో వర్షంలో తడుస్తు బిక్షాటన చేశారు. ఇఫ్టూ జిల్లా కార్యదర్శి సాంబశివుడు పాల్గొన్నారు.

చెత్త సేకరించిన మహిళా సర్పంచ్

భూత్పూర్: పంచాయతీ కార్మికులు 20 రోజులుగా సమ్మెలో ఉండటంతో గ్రామంలో చెత్త పేరుకుపోయిందని స్వయంగా మహిళా సర్పంచ్ ముందుకు వచ్చి పనులు చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కొత్త మొల్గర సర్పంచ్ వెంకటమ్మ వర్షాన్ని సైతం లేక్కచేయకుండా ఆమె భర్త, మండల రైతుబంధు అధ్యక్షుడు నర్సింహులు పంచాయతీ ట్రాక్టర్ నడపగా గ్రామంలో ఇంటింటా చెత్త సేకరించారు.

వర్షాలకు కూలుతున్న ఇళ్లు



మోతీఘణాపూర్‌లో కూలిన ఇల్లు

బాలానగర్: మండలపరిధిలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో పలు గ్రామాల్లో ఇళ్లు కూలిపోతున్నాయి. మోతీఘణాపూర్ నక్క చెన్నమ్మ ఇల్లు కూలిపోయింది. సర్పంచ్ మాలతి పరిశీలించి రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరారు. దీంతో ఆర్ఐ రాజేశ్వరి పరిశీలించి పరిస్థితిని ఉన్నత అధికారులకు నివేదిస్తామని తెలిపారు.



సంకలమద్దిలో కూలిన ఇంటి గోడ

అడ్డాకుల: మూసాపేట మండలం సంకలమద్ది గ్రామంలో ముసురు వానలకు బంగ్లగడ్డకు చెందిన మాల చెన్నమ్మ పెంకుటిల్లు బుధవారం పాక్షికంగా కూలిపోయింది. గోడ ఓ వైపు కూలడంతో ఆ సమయంలో ఇంట్లోనే ఉన్న కుటుంబ సభ్యులు బయటకు వచ్చారు. మరోచోట తాత్కాలిక ఆవాసం ఏర్పాటు చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు.

గ్రామాభివృద్ధికి నిధులు ఇవ్వండి

నవాబుపేట: గ్రామాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కాకర్లపహాడ్ ప్రజాప్రతినిధులు, ప్రజలు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని కోరారు. ఈ మేరకు బుధవారం ఆయను హైదరాబాద్‌లో కలిశారు. ప్రధానంగా అంతర్గత సీసీ రోడ్లు, ఇటీవల వానలకు ఇళ్లుకూలిపోయిన వారికి డబుల్ ఇళ్లు, పాఠశాల అభివృద్ధికి నిధులు ఇవ్వాలని విన్నవించారు. ఈ మేరకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని నాయకులు వివరించారు. వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, సర్పంచ్ జంగమ్మ, మైసమ్మ ఆలయ చైర్మన్ కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

కూరగాయల సాగుతో అధికలాభాలు



కోయిల్‌కొండ: కేంద్రీయ సస్యరక్షణ సమగ్ర కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ కృష్ణారెడ్డి కేశ్వాపూర్‌లో బుధవారం జీడిమెట్ల హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో రైతు క్షేత్రపాఠశాల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ పద్ధతుల ద్వారా కూరగాయలు సాగుచేయడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని అన్నారు. రైతులకు ఆయన అవగాహన కల్పించారు. సర్పంచ్ మొగులయ్య, అధికారి రవిశంకర్, వ్యవసాయ విస్తీర్ణ అధికారి వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఘనసన్మానం

మహమ్మదాబాద్: షేక్‌పల్లి తండాకు చెందిన కాట్రావత్ కిరణ్ ఢిల్లీ ఐఐటీలో మెకానికల్ ఇంజనీరింగ్ సీటు సంపాదించడంపై మండల గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు. మాజీ ఎంపీపీ శాంతీబాయి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. విద్యార్థి తల్లిదండ్రులు సరోజ, ఖండ్యలను అభినందించారు. లాలయ్య, ఇంతియాజ్, హాజీ, రవినాయక్, భాషా,వెంకట్, రవి, ముషారఫ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లకు సన్మానం



మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నాలుగు ఏళ్లుగా పని చేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ముగ్గురు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రాఘవరావు, అప్పలనాయుడు, శ్రీనివాస్‌లను బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఎస్పీ కె.నరసింహ, అదనపు ఎస్పీ రాములు, సురేష్‌కుమార్, డీఎస్పీలు మహేష్, రమణారెడ్డి, శ్రీనివాసులు, లక్ష్మణ్ ఉన్నారు.

కమ్యూనిటీ హాళ్లు నిర్మించాలని వినతి



ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మహమ్మదాబాద్: కులవృత్తులపైనే ఆధారపడి బతుకుతున్న తమకు కుండలు తయారీకోసం ప్రత్యేక క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని ఉమ్మడి మండల కుమ్మరులు పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారికోసం ప్రత్యేక కమ్యూనిటీ హాళ్లను నిర్మించి ఇవ్వాలని కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే సానుకూలాంగా స్పందించారు. భిక్షపతి, కుమ్మరి రాములు, దస్తగిరి, ఆంజనేయులు ఉన్నారు.

రంగస్థల నటుడికి సన్మానం



స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రముఖ కవి గుర్రం జాషువా వర్ధంతిని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్‌లోని వినుకొండలో జీవనజ్యోతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇటీవలే రాష్ట్రస్థాయి రంగస్థల పౌరాణిక పద్యాలు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాకు చెందిన సీనియర్ రంగస్థల నటుడు వి.నారాయణ పాల్గొని పద్యాలు ఆలపించారు. నారాయణను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. మెమోంటో అందజేసి సన్మానం చేశారు.

కళాకారులకు అభినందన

జడ్చర్ల: పద్యనాటక పోటీల్లో పట్టణానికి చెందిన నవజ్యోతి కళానిలయం బృందం ద్వితీయ స్థానాన్ని పొందడం అభినందనీయమని తెలంగాణ సాంస్కృతిక, నాటక కళా మండలి మాజీ చైర్మన్ శివకుమార్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన వారిని బుధవారం అభినందించి సన్మానించారు. ఈనెల 23, 24తేదీలలో జిల్లాకేంద్రంలోని శ్రీ సరస్వతీ కళాక్షేత్రం పెబ్బేరు ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో బృందం పాల్గొన్నట్లు వివరించారు. రంజిత్ బాబు, అయ్యన్న, పరమటయ్య, దామోదర్, కృష్ణ పాల్గొన్నారు.

గొడుగుల పంపిణీ

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలోని సంతలో బుధవారం కూరగాయలు అమ్ముకుంటున్న రైతులు, వ్యాపారులకు బీఆర్ఎస్ నాయకులు గొడుగులను పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు జట్టినర్సింహారెడ్డి, మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు బాల్‌రాజు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణపై హర్షం

జడ్చర్ల: గంగాపూర్ నుంచి బాలానగర్ వరకు ఉన్న రోడ్డు విస్తరించేందుకు రూ.56 కోట్లు మంజూరు చేయడం హర్షనీయమని జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య అన్నారు. గంగాపూర్ వద్ద సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చిత్రపటాలకు బుధవారం పాలాభిషేకం చేశారు. రోడ్డు విస్తరణతో ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ముడా డైరెక్టర్ ఇమ్ము పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి కృషి



చిన్నచింతకుంట కేజీబీవీలో విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి

- జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి

చిన్నచింతకుంట: పాఠశాలల బలోపేతానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి అన్నారు. చిన్నచింతకుంట మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థులకు బుధవారం ప్రభుత్వం అందించే దుస్తులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చి దిద్దేందుకు కృషి చేస్తున్నాడన్నారు. అందుకోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులను కల్పిస్తున్నాడని వివరించారు. అందులో భాగంగానే విద్యార్థులకు దుస్తుల పంపిణీ చేపట్టినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు మంచిగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. బీఆర్ఎస్ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

కార్గిల్ అమరుల త్యాగాలు మరువలేనివి



నివాళి అర్పిస్తున్న మాజీ సైనికులు



బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో..

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్) : దేశరక్షణ కోసం ప్రాణాలను లెక్క చేయకుండా పోరాటం చేసిన కార్గిల్ అమరుల త్యాగాలు మరువలేనివని మాజీ సైనికులు అభిప్రాయపడ్డారు. కార్గిల్ దివస్ సందర్భంగా బుధవారం తెలంగాణ చౌరస్తాలో కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. జోహార్ కార్గిల్ అమరులకు అంటూ నినాదాలు చేశారు. అనంతరం యూనియన్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్ మాట్లాడారు. సైనికుల సేవలకు వెలకట్టలేమని, దేశ రక్షణకోసం నిరంతరం పాటుపడతారని అన్నారు. అమరులైన సైనికులను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. యూనియన్ అడ్వైజర్ వెంకటయ్యగౌడ్, ఎంఆర్‌కే రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, నిరంజన్‌రాం, వెంకట్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రఘుపతిరెడ్డి, నరేందర్, శేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్, గణేష్‌బాబు, మురళీధర్‌రెడ్డి, రమేష్, శ్యామ్యుల్, మనోహర్, వెంకట్రాంరెడ్డి శైనన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్‌లో బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి విజయ్‌దివస్ నిర్వహించారు. అమరులైన సైనికులకు ఘనంగా నివాళులర్పించారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, బజరంగ్‌దళ్ విభాగ్ సంయోజక్ సురేష్, కుమార్, ఛత్రపతి, శివ, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



యాత్ర ప్రారంభిస్తున్న నాయకులు

నవాబుపేట: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ నుంచి ఎస్ఎఫ్ఐ జీపుయాత్రను బుధవారం ప్రారంభించారు. ప్రభుత్వం విద్యార్థులకు అనేక రకాల హామీలు ఇచ్చి విస్మరించిందని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30 వరకు జిల్లాలోని 17 మండలాలలో యాత్ర కొనసాగించనున్నట్లు వివరించారు. ప్రశాంత్, భరత్, మనికంఠ, రాధిక, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయంగా కందూర్ రోడ్డు



కందూర్ రోడ్డుపై ఏర్పడిన గుంతలు



సబ్‌స్టేషన్ వద్ద మలుపులో..

అడ్డాకుల: మండలంలోని కందూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. జాతీయ రహదారి నుంచి కందూర్ వరకు ఉన్న బీటీరోడ్డుపై చాలా చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. వాటిలో వర్షం నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ముఖ్యంగా సాయిబాబా దేవాలయం, విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గుంతలు ఎక్కువగా ఉన్నాయి. సబ్‌స్టేషన్ వద్ద ఉన్న మలుపులో పెద్ద గుంతలు ఏర్పడటంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుపై కందూర్, చౌడాయపల్లి, వడ్డెపల్లి, సుంకరామయ్యపల్లి, మానాజీపేట, ఉప్పరిపల్లి తదితర గ్రామాలకు వెళ్లే వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వీరితో పాటు జిల్లా నలుమూలల నుంచి కందూర్ రామలింగేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు కూడా ఇదే రోడ్డుపై రావాల్సి ఉంది. ఈనేపథ్యంలో ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

మణిపూర్ ఘటనపై కాంగ్రెస్ నిరసన



తెలంగాణ చౌరస్తాలో నిరసన చేపట్టిన కాంగ్రెస్ నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలకు వ్యతిరేకంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో నిరసన చేపట్టారు. పలువురు నాయకులు మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడడంలో కేంద్రం, అక్కడి రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. మణిపూర్ దురాగతాలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మోదీ, అమిత్‌షా దిష్టిబొమ్మలు దహనం చేశారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, సీనియర్ నాయకుడు చంద్రకుమార్‌గౌడ్, జిల్లా మైనార్టీసెల్ అధ్యక్షుడు ఎండి.ఫయాజ్, పట్టణ అధ్యక్షుడు జహీర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు సాయిబాబా, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.